## ఎన్ఆర్ఈసీ విద్యార్థికి గోల్డ్ మెడల్




విశ్రుతను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

**మేడ్చల్‌రూరల్:** గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహ్మారెడ్డి ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్ సాధించింది. కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న విశ్రుత ఇటీవల నగరంలోని కాచిగూడ విక్టోరియా ప్లే గ్రౌండ్‌లో పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన 69 కేజీల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో పాల్గొని బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా కళాశాలలో విద్యార్థిని విశ్రుతను కళాశాల కార్యదర్శి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

## ఆటోస్టాండ్ కోసం వినతి

**మేడ్చల్:** పట్టణంలోని వివేకానంద విగ్రహ కూడలి వద్ద కేసీఆర్ పార్క్ సమీపంలో ఆటోస్టాండ్ ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరుతూ పట్టణ ఆటో డ్రైవర్లు మున్సిపల్ కమిషనర్ నాగారెడ్డికి, మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహ్మారెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ప్రస్తుతం అంబేడ్కర్ విగ్రహ కూడలి వద్ద ఆటోస్టాండ్ ఉందని, వివేకానంద విగ్రహ కూడలి వద్ద ఏర్పాటు కోసం స్థలం కేటాయించాలని కోరారు. కేసీఆర్ పార్క్ వద్ద ఆటోస్టాండ్ ఏర్పాటు చేయడం వల్ల పట్టణంలోకి వెళ్లే ప్రయాణికులకు సులువుగా ఉంటుందన్నారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆటో యూనియన్ నాయకులు విజయరావు, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## కార్మిక సంక్షేమ బోర్డులో పేరు నమోదు చేసుకోవాలి



**జవహర్‌నగర్:** ప్రతి కార్మికుడు కార్మిక సంక్షేమ బోర్డులో పేరును నమోదు చేసుకోవాలని మహిళా కార్మిక సమాఖ్య రాష్ట్ర అధ్యక్షురాలు మస్తాన్‌బి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌కి చెందిన భవన నిర్మాణ కార్మికుడు సోమయ్య ఇటీవల మృతిచెందాడు. ఈ సందర్భంగా కార్మిక మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో సంక్షేమ బోర్డు నుంచి మంజూరైన రూ.1.30 లక్షల చెక్కును శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాల సమాఖ్య ఇన్‌చార్జి మీరా, లలిత తదితరులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ ప్రణీతాగౌడ్ తదితరులు

**కీసర:** దమ్మాయిగూడ మున్సిపాలిటీని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతాగౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో సుమారు 30 లక్షల ఎమ్మెల్సీ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాదిరెడ్డి నరేందర్‌రెడ్డి, బాలమురళి, కౌన్సిలర్ వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు వసుపతి శ్రీకాంత్‌గౌడ్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## మాలల సింహగర్జనను విజయవంతం చేయాలి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

**శామీర్‌పేట్:** మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మేడ్చల్ జిల్లా మాలమహానాడు కన్వీనర్ పరశురాం అన్నారు. డిసెంబర్ 1న నగరంలోని పరేడ్ గ్రౌండ్‌లో జరిగే మాలల సింహగర్జన కరపత్రాన్ని శుక్రవారం శామీర్‌పేటలో వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ నెల 27న ఉమ్మడి శామీర్‌పేట మండలంలో పాదయాత్ర నిర్వహించడం జరుగుతుందని, పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే సింహగర్జనకు మాల సోదరులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజు, సెక్రెటరీ బాలేష్, యువజన నాయకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం

**మౌలాలి:** వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీసాయినగర్‌లో కాప్రా లయన్స్‌క్లబ్ అధ్యక్షురాలు శ్రీదేవి అధ్యక్షతన హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి స్థానిక కార్పొరేటర్ రాజ్యలక్ష్మి హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో కేన్సర్ స్క్రీనింగ్, కంటి పరీక్షలు, డెంటల్, జనరల్ చెకప్, బీపీ, షుగర్ పరీక్షలు చేశారు. లయన్స్ డిస్ట్రిక్ 320సి ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ లయన్ ఇన్నారెడ్డి, సెకండ్ వైస్ డిస్ట్రిక్ గవర్నర్ కృష్ణారెడ్డి వైద్యబృందం సభ్యులు పాల్గొన్నారు.

## వెన్నెల గద్దర్‌కు సత్కారం

**అల్వాల్:** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియమితులైన గుమ్మడి వెన్నెల గద్దర్‌ను శుక్రవారం వెంకటాపురంలో పాలమూరు ప్రజల సంఘం నేతలు కలిసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా పాలమూరు ప్రజాసంఘం నాయకులు బైరపోగు సాంబశివుడు మాట్లాడుతూ.. ప్రజాయుద్ధనౌక గద్దర్ ఉద్యమాలు, పోరాటం, పాటలు, మాటలు సమాజాన్ని ఎంతో చైతన్యం చేస్తూ.. ప్రత్యేక తెలంగాణ కోసం చేసిన ఉద్యమం సమాజం మరువదన్నారు. ఆయన కుమార్తెను తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్‌గా నియమించడం అభినందనీయమన్నారు. లక్ష్మయ్య, నల్లవల కురుమయ్య, మురళి, రాజేష్, మధు, ఎర్రమన్ను కురుమయ్య, రమేష్, నాగరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# తొలగని సందిగ్ధత..

- పురపాలికల్లో జీపీ ఉద్యోగుల కొనసాగింపుపై అస్పష్టత
- జీఓ 51 ప్రకారం 2019 తర్వాత నియమితులైన వారి తొలగింపుపై కసరత్తు
- విలీన 28 జీపీల్లోని 350 మంది అదనపు ఉద్యోగులకు ముప్పు
- జనాభా ప్రాతిపదికన ఉద్యోగ నియామకాలు చేపట్టాలంటున్న సంఘాలు
- జీవో 51పై ఉద్యోగ సంఘాల ఆగ్రహం
- అమలు చేయవద్దని వినతి



**సాక్షి,సిటీబ్యూరో:** పురపాలక సంఘాల్లో విలీనమైన పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులను కొనసాగిస్తారా.. లేదా అన్న మీమాంస కొనసాగుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ప్రవేశపెట్టిన జీఓ 51 అమలుపై పంచాయతీరాజ్ శాఖ కసరత్తు చేస్తున్న నేపథ్యంలో తమ ఉద్యోగాల భవిష్యత్ ఏమిటోనన్న ఆందోళనను వారు వ్యక్తం చేస్తున్నారు. పట్టణాల్లో గ్రామ పంచాయతీల విలీనంతో తమ నెలసరి వేతనాలు పెరగగలవని భావించిన సంబంధిత ఉద్యోగులు, కార్మికుల పరిస్థితి ముందు నుయ్యి వెనుక గొయ్యిలా మారింది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఓఆర్ఆర్ లోపల ఉన్న 28 గ్రామ పంచాయతీలను సమీప పురపాలికల్లో ప్రభుత్వం విలీనం చేసిన విషయం తెల్సిందే. అలాగే, ఈ గ్రామ పంచాయతీ (జీపీ)ల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులు ప్రస్తుతం యధాతదంగా పురపాలికల్లో విధులు నిర్వహిస్తున్నా.. ఇప్పటి వరకు వారిని పురపాలక సంఘాల ఉద్యోగులుగా, కార్మికులుగా గుర్తించకపోవటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### 51 జీఓతో.. పరేషాన్

గత ప్రభుత్వం 2019లో ప్రవేశ పెట్టిన జీవో 51తో పురపాలక సంఘాల్లో విలీనమైన జీపీల్లో పని చేస్తున్న కార్మికులకు, ఉద్యోగులకు పరేషాన్ నెలకొంది. జీవో 51 మార్గదర్శకాల ప్రకారం గ్రామ పంచాయతీల్లో 500 మంది జనాభాకు ఒక ఉద్యోగి చొప్పున మల్టీ పర్పస్ వర్కర్‌ను నియమించుకోవాల్సి ఉంది. అయితే జీవో 51 పై కసరత్తు చేస్తున్న పంచాయతీరాజ్ శాఖ గ్రామ పంచాయతీల్లో ఉన్న అదనపు సిబ్బందిని తొలగించే పనిలో నిమగ్నం కావటంతో.. పురపాలికల్లో విలీనమైన జీపీల్లో పని చేస్తున్న ఉద్యోగుల భవిష్యత్‌కు ప్రమాదం ముంచుకొచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ఏడు పురపాలక సంఘాల పరిధిలో విలీనమైన 28 గ్రామ పంచాయతీల్లో అదనంగా పని చేస్తున్న 350 మంది ఉద్యోగుల తొలగింపుపై విస్తృతంగా చర్చ సాగుతోంది. అలాగే, పురపాలక సంఘాలు కూడా వీరిని తమ ఉద్యోగులుగా గుర్తించకపోవటం ఒక ఎత్తయితే.. మరో కపక్క పంచాయతీరాజ్ శాఖ జీవో 51 అమల్లో భాగంగా విలీన జీపీల్లోని అదనపు సిబ్బంది ఏరివేతపై నివేదిక రూపొందించటం వంటి విషయాలు వారి ఉద్యోగ భద్రతపై అనుమానాలను రేకెత్తిస్తోంది.

### 2 నెలలుగా అందని వేతనాలు

పురపాలక సంఘాల్లో విలీనమైన 28 గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు రెండు నెలలుగా వేతనాలు అందక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తెలంగాణలో అతి ముఖ్యమైన దసరా, దీపావళి పండుగ సంబురాలను కూడా అర్ధాకలితో జరుపుకోవాల్సి వచ్చిందని వారు ఆవేదన చెందుతున్నారు. దీంతో వీరంతా తమ జీతాల కోసం ప్రస్తుతం పని చేస్తున్న పురపాలక సంఘాల కార్యాలయాలు.. గతంలో పని చేసిన పంచాయితీరాజ్ శాఖ అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### తొలగింపు కసరత్తుపై సంఘాల ఆగ్రహం

ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పంచాయతీ శాఖ రూపొందించిన జాబితాను పరిశీలిస్తే.. జీవో 51 ప్రకారం ఏడు పురపాలక సంఘాల్లో విలీనమైన 28 పంచాయతీల్లో అదనంగా విధులు నిర్వహిస్తున్న 350 మంది మల్టీ పర్పస్ వర్కర్ల భవిష్యత్తుకు ప్రమాదం పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. ఉద్యోగ, కార్మిక సంఘాలు మాత్రం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రవేశ పెట్టిన జీవో 51ని రద్దు చేయటంతో పాటు శివారు పురపాలక సంఘాల్లో విస్తరించిన కాలనీలు, పెరిగిన జనాభాకు అనుగుణంగా ఉద్యోగులు, కార్మికులను నియమించాలని కోరుతున్నాయి. అలాగే, పెండింగ్‌లో ఉన్న ఉద్యోగుల వేతనాలను సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి.

## ప్రగతిశీల రైతులకు మొబైల్ అప్లికేషన్‌పై శిక్షణ



**సాక్షి,సిటీబ్యూరో:** మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రగతిశీల రైతులకు శుక్రవారం హైదరాబాద్ సెంట్రల్ ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్‌మెంట్ సెంటర్ హైదరాబాద్ నుంచి సంబంధిత వ్యవసాయశాఖ నిపుణులు ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్ శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ శిక్షణలో మొబైల్ అప్లికేషన్ ఉపయోగాలు, తెగుళ్ల నివారణతో పాటు దాని ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఈ యాప్‌ను ఉపయోగించడం ద్వారా రైతులు ఎలాంటి ఆలస్యం లేకుండా తెగుళ్లను సులభంగా గుర్తించటంతోపాటు తక్షణ నియంత్రణ చర్యలను అనుసరించవచ్చునని పేర్కొన్నారు. పురుగుమందు ఖర్చులు తగ్గిస్తుందని, పంట తెగులును సమర్ధవంతంగా పర్యవేక్షించడానికి కూడా ఉపయోగపడుతుందన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తక్షణమే సలహాలను పొందవచ్చన్నారు. ఈ మొబైల్ అప్లికేషన్‌ను రైతులు ప్రత్యక్షంగా వీక్షించటం కోసం క్షేత్ర సందర్శన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ నుంచి ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు వెంకటరెడ్డి, సునీత, అసిస్టెంట్ ప్లాంట్ ప్రొటెక్షన్ ఆఫీసర్లు, వ్యవసాయశాఖ నుంచి జిల్లా వ్యవసాయశాఖ అధికారి చంద్రకళ, మండల వ్యవసాయశాఖ అధికారులు వెంకటరామిరెడ్డి, శిరీష, ఎంఏఓలు, ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ అప్లికేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులకు క్రీడాసామగ్రి అందజేత



**కీసర:** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు చేయూత నిచ్చేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం నాగారం మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడల్లో రాణించేందుకు శ్రేయోభిలాషి సేవా ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు స్పోర్ట్స్ కిట్ పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువులతోపాటు, క్రీడల్లో కూడా రాణించాలన్నారు. పోతం శెట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాగారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు క్రీడాసామాగ్రిని అందించేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సిద్దిపేటజిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్, స్కూల్ హెడ్ మాస్టర్ రాములు, బీజేపీ మేడ్చల్ జిల్లా సెక్రటరీ శ్యామ్‌సుందర్, బీజేపీ అధ్యక్షుడు వేణుగోపాల్, కౌన్సిలర్ శ్రీనివాస్, రవీంద్రరెడ్డి, నాగరాజు, కిషోర్‌గౌడ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు



వాటర్‌వర్క్స్ అధికారులతో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

**కుషాయిగూడ:** డివిజన్‌లో తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి వాటర్‌వర్క్స్ అధికారులకు సూచించారు. గత వారంరోజులుగా డివిజన్ వ్యాప్తంగా తలెత్తుతున్న తాగునీటి లోప్రెషర్ సమస్య దృష్ట్యా శుక్రవారం ఆమె వాటర్‌వర్క్స్ అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. రాధిక రిజర్వాయర్ నుంచే తాగునీటి సరఫరా తగ్గిన కారణంగానే తాగునీటిలో ప్రెషర్ సమస్య తలెత్తిందని అధికారులు కార్పొరేటర్‌కు వివరించారు. వెంటనే మరమ్మతులు చేపట్టి తాగునీటి సమస్యను తీర్చాలని ఆమె అధికారులకు సూచించారు. సమావేశంలో ఏఈ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక సమస్యలు పరిష్కరించండి



కార్పొరేటర్ స్వర్ణరాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాలనీవాసులు

**కాప్రా:** సాయిరాంనగర్‌లో నెలకొన్న సమస్యలపై స్థానిక కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణికి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం కాలనీలో ఉన్న డ్రైనేజీ సామర్థ్యం సరిపోవడంలేదని, దాన్ని విస్తరించడంతో పాటు పైపులైన్ సామర్థ్యాన్ని కూడా పెంచాలని కోరారు. సీసీరోడ్ల మరమ్మతులు, బస్తీ దవాఖానాలో ఫ్లోరింగ్, డబుల్‌బెడ్రూం ఇళ్ల నుంచి యూజీడీ పైపులైన్, వీధిదీపాలు, పవర్ బోర్ల మరమ్మతులు వంటి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. సానుకూలంగా స్పందించిన కార్పొరేటర్ తన దృష్టికి వచ్చిన సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

### సన్మానం..

సాయిరాంనగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని కార్పొరేటర్ స్వర్ణరాజ్ శివమణి సన్మానించారు. కాలనీ పర్యటనలో భాగంగా కమిటీ సభ్యులతో సమావేశమైన ఆయన శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అధ్యక్షుడు రాజు, సెక్రటరీ తిరుమలేష్‌గౌడ్, వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, స్థానిక కాంగ్రెస్ నేతలున్నారు.

## ఐక్యంగా హక్కులు సాధించుకోవాలి



మాట్లాడుతున్న వివేక్ వెంకటస్వామి

**మల్కాజిగిరి:** మాలలు ఐకమత్యంగా ఉన్నప్పుడే హక్కులను సాధించుకోగల్గుతామని చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అన్నారు. శుక్రవారం నేరెడ్‌మెట్‌లోని అంబేడ్కర్‌భవన్‌లో మాలల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. మాలల సత్తా చాటడానికి డిసెంబర్ 1న జరిగే సింహగర్జనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సింహగర్జన పోస్టర్‌ను ఆవిష్కరించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తామంటే ఒప్పుకునేది లేదని, హక్కుల పరిరక్షణకు పోరాటం చేయాల్సిందేనన్నారు. అంబేడ్కర్ వారసులుగా మాలల ఆత్మగౌరవాన్ని కాపాడుకుంటామన్నారు. ఎమ్మెల్యే నాగరాజు, నేతలు రాజు, రావుల అంజయ్య, గంగాధర్ కృష్ణ, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## మహిళల సమస్యలపై పోరాటం



**మల్కాజిగిరి:** మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని సీపీఎం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు సృజన అన్నారు. శుక్రవారం మల్కాజిగిరి మండల కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. ఎన్ని చట్టాలు వచ్చినా మహిళలపై వేధింపులు, దాడులు ఆగడం లేదన్నారు. ఈనెల 25 నుంచి డిసెంబర్ 10 వరకు మానవ హక్కులే మహిళల హక్కులుగా సదస్సులు నిర్వహిస్తామన్నారు. పెరిగిపోయిన నిత్యావసరధరలతో పాటు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తామన్న హామీలు అమలు చేసేలా పోరాటం చేస్తామన్నారు. జిల్లా నాయకురాలు మంగ, నజీమా, లక్ష్మి పద్మావతి, నాగమణి, పద్మ, షాహీన్, రాజ్యలక్ష్మి, సుజాత, లలిత పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**ఘట్‌కేసర్:** విద్యుత్ మరమ్మతుల కారణంగా కొండాపూర్ 33/11కేవీ సబ్‌స్టేషన్, కొండాపూర్ 11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కొండాపూర్ గ్రామం, సంస్కృతి ఇంజనీరింగ్ కళాశాల, సోను కాలనీ, వెంకటేశ్వర కాలనీ, స్వర్ణకుటీర్ కాలనీ, విజ్ఞాన్ ఇంజనీరింగ్ కాలేజ్, సంఘమిత్ర కాలనీ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ బలరాం తెలిపారు.

**కీసరలో..** విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ యాద్గార్‌పల్లిఫీడర్ మరమ్మతుల కారణంగా నేడు ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు యాద్గార్‌పల్లి గ్రామం, యాద్గార్‌పల్లి చౌరస్తా, కీసర రహదారి ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏఈ మురళీకృష్ణ తెలిపారు.

## టీచర్లను కేటాయించవద్దు

**కీసర:** సమగ్ర కుటుంబ సర్వే వివరాలను ఆన్‌లైన్ నమోదు బాధ్యత ఉపాధ్యాయులకు కేటాయించవద్దని తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టి.యు.టి.ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు రామినేని వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం ఆయన కీసరలో మాట్లాడుతూ.. నవంబర్ 6 నుంచి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు ప్రభుత్వ ఆదేశాల మేరకు ఒక పూట బడిలో విద్యను బోధిస్తూ, రెండవ పూట ఇంటింటికి తిరిగి సమగ్ర కుటుంబ ఆర్థిక సమాజిక విద్యా సర్వేలో పాల్గొంటూ వివరాలు సేకరిస్తున్నారు. ఈ నెల 28 వరకు వివరాల నమోదు కార్యక్రమం ముగుస్తుండటంతో.. వాటిని ఆన్‌లైన్‌లో నమోదు చేసే ప్రక్రియను ఉపాధ్యాయులకు అప్పగించకుండా..ఇతరులను అప్పగించాలని, ఉపాధ్యాయులను పాఠశాలకే పరిమితం చేయాలన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## మీర్కాన్ కుంటను పరిశీలించిన హైడ్రా అధికారులు

**పోచారం:** అన్నోజిగూడలోని మీర్కాన్ కుంటను హైడ్రా అధికారులు శుక్రవారం పరిశీలించారు. 4.12 ఎకరాల మీర్కాన్ కుంటలో సుమారు 2 వేల చదరపు గజాల విస్తీర్ణాన్ని బతుకమ్మ ఘాట్ కోసం పూడ్చివేసినట్లు 10వ వార్డు కౌన్సిలర్ వెంకటేష్ గౌడ్ ఫిర్యాదు చేయడంతో హైడ్రా అధికారులు సందర్శించి వివరాలు సేకరించారు. మీర్కాన్ కుంట పూడికపై మున్సిపల్ చైర్మన్‌తో పాటు మరో వ్యక్తిపై ఇప్పటికే పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కుంట భౌతిక స్థితిగతులపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. హైడ్రా అధికారులు ఎప్పుడు ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని కొందరు స్థానిక ప్రజాప్రతినిధులు ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది.

## వైభవంగా.. సాముహిక కార్తీక దీపోత్సవం



సాముహిక కార్తీక దీపోత్సవంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తదితరులు

**కీసర:** కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామి దేవాలయం వద్ద కార్తీక మాసోత్సవాల ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భాగంగా దేవాదాయశాఖ ఆదేసానుసారం నిర్వహిస్తున్న సాముహిక కార్తీక దీపోత్సవం కార్యక్రమంలో కీసర సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం, ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.